# 102. అత్ తకాసుర్ (అధికంగా ప్రోగుచేయటం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 8 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా సంపద పట్ల వ్యామోహం గురించి వివరించింది. మానవులు విపరీతంగా ప్రాపంచిక సుఖభోగాల వ్యామోహం కలిగి ఉంటారు. ఎల్లప్పుడు తమ సంపదను ఇంకా పెంచుకోవాలని చూస్తుంటారు. తమ హోదాను, అధికారాన్ని పెంచుకో వాలని ప్రయత్నిస్తూ ఉంటారు. ప్రాపంచిక ప్రయోజనాలను సాధించడంలో పూర్తిగా నిమగ్నమైపోయి పరలోకాన్ని విస్మరిస్తారు. నిజానికి పరలోకం మనిషి భవిష్యత్తు. మృత్యువు ఆసన్నమైనప్పుడు, సమాధిలో వాస్తవాన్ని గుర్తిస్తారు. తీర్పుదినాన వారు తమ కళ్ళారా నరకాన్ని చూసుకుంటారు. అల్లాహ్‌కు దూరమైనందుకు, నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు బాధాకరమైన శిక్షను అనుభవిస్తారు.

# 102. అత్ తకాసుర్ సూరా

# سُوْرَةُ التَّكَاثُرِ

అవతరణ :మక్కా ఆయతులు : 8

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

**1** అధికంగా పొందాలన్న ఆశ మిమ్మల్ని పరధ్యానంలో పడవేసింది.[1]

اَلْهٰكُمُ التَّكَاثُرُ ۙ①

**2** ఆఖరికి మీరు (ఈ ఆశల ఆరాటంలోనే) సమాధులకు చేరుకుంటారు.[2]

حَتّٰى زُرْتُمُ الْمَقَابِرَ ②

**3** ఎన్నటికీ కాదు.[3] మీరు తొందరగానే తెలుసుకుంటారు.

كَلَّا سَوْفَ تَعْلَمُوْنَ ۙ③

**4** మరెన్నటికీ కాదు... మీరు చాలా తొందరగానే తెలుసుకుంటారు.[4]

ثُمَّ كَلَّا سَوْفَ تَعْلَمُوْنَ ④

1. **'అల్హా'** అంటే ఏమరుపాటుకు లోనుచేయటం, మరుపుకు గురిచేయటం, అలసత్వంలో పడవేయటం అని అర్థం. పరధ్యానం అన్నా అదే. 'తకాసుర్' అంటే మరీ ఎక్కువగా పొందాలన్న ఆశ. అది సిరిసంపదలకు, సంతానానికి, పదవులకు, బంగారం వజ్రవైఢూర్యాలకు – అన్నింటికీ వర్తిస్తుంది. మనిషికి వస్తువుల పట్ల ఆశ ఉండటంలో తప్పులేదు. కాని వాటిని జుర్రుకోవాలన్న ఆరాటం అతన్ని దైవాజ్ఞలపట్ల, ధర్మాదేశాల పట్ల ఏమరుపాటుకు గురిచేయకూడదు. దేవుడు మనిషిలోని ఈ బలహీనతను ఎత్తిచూపటంలోని అసలు ఉద్దేశం ఏమిటంటే మానవ సమాజాల్లో చాలామంది ఈ పరీక్షలో బోల్తా కొడుతూ ఉంటారు.
2. దీని భావమేమిటంటే ఈ ఆశల ఆరాటంలో మనిషి తీవ్రంగా పోరాడుతూ ఉంటాడు. ఆఖరికి తన జీవిత లక్ష్యాన్ని కూడా మరచిపోతాడు. అంతలోనే అతను కాటికి చేరుకోవలసి వస్తుంది.
3. అంటే మీలోని పేరాశ మంచిది కాదు. అది మిమ్మల్ని బాగు పడనివ్వదు.
4. అంటే దీని (పేరాశ) పరిణామం ఏమిటో మీరు త్వరలోనే తెలుసుకుంటారు. ఈ విషయం బాగా గుర్తుంచుకోవాలన్న ఉద్దేశంతో ఒకటికి రెండుసార్లు నొక్కి వక్కాణించబడింది.

**5** అది కాదు. మీరు గనక నిశ్చిత జ్ఞానంతో తెలుసుకున్నట్లయితే (అసలు పరధ్యానంలోనే పడిఉండరు).[5]

كَلَّا لَوْ تَعْلَمُوْنَ عِلْمَ الْيَقِيْنِ ۝٥

**6** మీరు నరకాన్ని చూసి తీరుతారు.[6]

لَتَرَوُنَّ الْجَحِيْمَ ۝٦

**7** అవును! మీరు దానిని ఖచ్చితంగా కళ్ళారా చూస్తారు సుమా![7]

ثُمَّ لَتَرَوُنَّهَا عَيْنَ الْيَقِيْنِ ۝٧

**8** మరి ఆ రోజు (దేవుని) అనుగ్రహాల గురించి మిమ్మల్ని తప్పకుండా ప్రశ్నించటం జరుగుతుంది.[8]

ثُمَّ لَتُسْـَٔلُنَّ يَوْمَئِذٍ عَنِ النَّعِيْمِ ۝٨

5. దీని భావం ఇది : మీ పరధ్యానం వల్ల మీకు వాటిల్లే నష్టం ఏమిటో మీరు తెలుసుకున్నట్లయితే మీరెన్నటికీ ఈ ప్రాపంచిక వ్యామోహంలో పడరు. పైగా మీరు దైవానికి భయపడుతూ మధ్యేమార్గం అవలంబిస్తారు. అటు దేవుని హక్కులను, ఇటు దాసుల హక్కులను కూడా సరిగ్గా నిర్వర్తిస్తారు.

6. దైవసాక్షి! పేరాశవల్ల పరధ్యానంలో పడినవారు నరకయాతనకు తప్పక గురవుతారు.

7. తొలిచూపు దూరం నుంచి, ఈసారి చూపు చాలా దగ్గరి నుంచి. అందుకే దీన్ని నిశ్చిత కన్నులతో చూస్తారని అనటం జరిగింది.

8. అంటే – మనిషికి దేవుడు ప్రసాదించిన వివిధ వరాలను గురించి నిలదీసి అడగటం జరుగుతుంది. ఉదాహరణకు : కళ్ళు, చెవులు, మనోమస్తిష్కాలు, కాళ్ళుచేతులు, ఆస్తిపాస్తులు, ఆలుబిడ్డలు, ఆయురారోగ్యాలు ఇత్యాదివి. ఇంతకీ ప్రశ్నించబడేదెవరు? అవిశ్వాసులు మాత్రమేనా? వీటిని గురించి ప్రతి ఒక్కరూ ప్రశ్నించబడతారని కొందరు అభిప్రాయపడగా అవిశ్వాసులు మాత్రమే ప్రశ్నించబడతారని మరికొంతమంది అన్నారు. ఈ దైవానుగ్రహాలను సద్వినియోగం చేసుకున్నవారు (ప్రశ్నించబడినప్పటికీ) శిక్షనుండి సురక్షితంగా ఉంటారు. దైవానుగ్రహాలను దుర్వినియోగపరచిన వారికి మాత్రం శిక్ష తప్పదు.